
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం : 25 ఏప్రిల్ : 2024



సోమశిలలో 8.34 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 8.345 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 325 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,210
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,628
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,827
నవర (8 గ్రాములు)	రూ.54,616



అగ్నిప్రమాదం

గడ్డివాములు దగ్ధమైన ఘటన చేజర్ల మండలంలో చోటు చేసుకుంది. ఘటనలో రూ.30 వేల నష్టం వాటిల్లింది. 8లో

న్యూస్‌రీల్

న్యాయమూర్తుల బదిలీలు

నెల్లూరు (లీగల్): పలువురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను బుధవారం జారీ చేసింది. గుంటూరు సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిని నెల్లూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా.. కృష్ణా జిల్లా బంటుమిల్లి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి సుధాకర్‌రావును కావలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా.. రేపల్లె జూనియర్ సివిల్ జడ్జి జగదీష్‌ను ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల సాధారణ పరిశీలకుడిగా నియమితులైన రామ్‌కుమార్ గౌతమ్ నగరానికి బుధవారం విచ్చేశారు. నగరంలోని ఓ హోటల్‌కు చేరుకున్న ఆయనకు జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరమణ ఘన స్వాగతం పలికారు. కందుకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో అబ్జర్వర్‌గా ఆయన వ్యవహరించనున్నారు.

సందేహాలను నివృత్తి చేసుకోండి

నెల్లూరు(క్రైమ్): ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవచ్చని జిల్లా పోలీస్ పరిశీలకుడు అశోక్ దూబే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పోలీస్ కవాతు మైదానంలో గల అతిథిగృహంలో ఉదయం 10.30 నుంచి 11.30 వరకు అందుబాటులో ఉంటానని చెప్పారు. అత్యవసర సమయాల్లో 75696 18685 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు(అర్బన్): వచ్చే నెల్లో నిర్వహించనున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు గడువును ఈ నెల 30 వరకు పొడిగించారని ఆర్‌ఐఓ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు సైతం ఇదే గడువు వర్తించనుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

13న వేతనంతో కూడిన సెలవు

నెల్లూరు (సెంట్రల్): సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్‌ను మే 13న నిర్వహించనున్న తరుణంలో కార్మికులకు వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని నెల్లూరు జిల్లా ఉప కార్మిక కమిషనర్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నిబంధనను విధిగా పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పోలూరి శతజయంతి ఉత్సవ సమావేశం



సురేంద్రనాథ్‌శర్మకు సత్కారం

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో పోలూరి హనుమజ్జానకీ రామశర్మ శతజయంత్యుత్సవాల సమావేశాన్ని చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో పద్యకళా పరిషత్ జిల్లా శాఖ పర్యవేక్షణలో బుధవారం నిర్వహించారు. హనుమజ్జానకీరామశర్మ రచించిన శ్రీరామాయణ దర్శనంపై సాంప్రతి సురేంద్రనాథ్‌శర్మ ఉపన్యసించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. వేదం రాధాకృష్ణమూర్తి, నలుబోలు బలరామయ్యనాయుడు, చక్రాల వెంకటలక్ష్మీనరసింహం, చక్రాల ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లలో ప్రమాణాలను పాటించాలి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ నిర్దేశించిన ప్రమాణాలను వాటర్ ప్లాంట్లలో తప్పక పాటించాలని ఎంహెచ్‌ఓ వెంకటరమణ ఆదేశించారు. నగరంలోని శ్రీనివాసాగ్రహారంలో గల వాటర్ ప్లాంట్ నుంచి క్యాన్లను రవాణా చేస్తున్న వాహనాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్లాంట్ల నిర్వహణకు అనుమతులను తప్పక పొందాలని, వీటిని ఏటా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అనంతరం రామ్మూర్తినగర్‌లోని కేటరింగ్ సెంటర్లను తనిఖీ చేశారు.



నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి



నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న బుర్రా మధుసూదన్‌యాదవ్

ఆత్మకూరు అదుర్స్

ఆత్మకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి తన నామినేషన్‌ను బుధవారం దాఖలు చేశారు. వివిధ మండలాల నుంచి తరలివచ్చిన అభిమానులు, అశేష జనసందోహం నడుమ ఆర్వో కార్యాలయానికి ర్యాలీగా ఆయన చేరుకున్నారు. అనంతరం దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి సతీమణి శ్రీకీర్తి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, చేజర్ల జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, న్యాయవాది మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వో మధులతకు అందజేశారు. అనంతరం ఆర్వో కార్యాలయానికి దూరంలో విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ విజయం తథ్యమని, జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం మరోసారి ఏర్పడనుందని తెలిపారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, జెడ్పీటీసీలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, ఎంపీపీలు తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, పెయ్యల సంపూర్ణమ్మ, నేతలు కొండా వెంకటేశ్వర్లు, వినయ్‌కుమార్‌రెడ్డి, మైనార్టీ నేత పర్వీన్, లక్ష్మీదేవి, హజరత్తమ్మ పాల్గొన్నారు.

ఉదయగిరి.. అభిమాన ఝరి

ఉదయగిరి: అభిమాన ఝరితో ఉదయగిరి బుధవారం తడిచిముద్దయింది. అశేష జనవాహిని వెంటరాగా... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తన నామినేషన్‌ను దాఖలు చేశారు. తొలుత బ్రాహ్మణపల్లిలోని ఇంటి వద్ద కుటుంబసభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, పార్టీ నేతలు, అభిమానులతో కలిసి భారీ కాన్వాయ్‌లో వెంకటంపేట అభయాంజనేయస్వామి ఆలయానికి చేరుకొని పూజలు చేసి వేదపండితుల ఆశీర్వచనాలను అందుకున్నారు. అనంతరం ఉదయగిరిలోని బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలు చేశారు. వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీ.. కోలాటం, డప్పు వాయిద్యాలు.. బాణసంచాల నడుమ పంచాయతీ బస్టాండ్‌కు చేరుకున్నారు. దర్గాలో మతపెద్దల ఆశీస్సులు అందుకున్న అనంతరం ఆర్వో రమేష్ ప్రేమ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. అభినవ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ మోదీ రామాంజనేయులు, అల్లూరు రాజు, అలీ అహ్మద్, దుగ్గిరెడ్డి గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో కోలాహలం

కందుకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ నామినేషన్ కార్యక్రమం బుధవారం కోలాహలంగా సాగింది. వేలాది మంది పార్టీ కార్యకర్తలు, నేతలు, అభిమానులు, ప్రజల కేరింతల మధ్య తన కుటుంబసభ్యులతో కలిసి మరో సెట్ నామినేషన్‌ను ఆయన దాఖలు చేశారు. నియోజకవర్గ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలతో కందుకూరు కిక్కిరిసిపోయింది. పార్టీ కార్యాలయం నుంచి పామూరు బస్టాండ్, ఏరియా హాస్పిటల్, అంకమ్మ తల్లి దేవాలయం, పోస్టాఫీస్ సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. బుర్రాతో పాటు పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొని ప్రచార వాహనం నుంచి ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం ఆర్వో కార్యాలయానికి చేరుకున్న బుర్రా తన సతీమణి లక్ష్మి, కుమారులు వెంకటసాయి, లక్ష్మీనారాయణతో కలిసి నామినేషన్ పత్రాలను ఆర్వో విద్యాధరికి అందజేశారు. లక్ష్మి ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు.



అశేష జనవాహిని



జనసందోహం



పోటెత్తిన ప్రజాభిమానం

అజ్ఞాతవాసి



తమ కూటమిలో భాగస్వామైన పవన్ కల్యాణ్ నటించిన అజ్ఞాతవాసి చిత్ర టైటిల్‌ను టీడీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి నారాయణ స్ఫూర్తిగా తీసుకున్నారు. అందుకేనేమో 2019లో ఓటమిపాలైన నాటి నుంచి నెల్లూరు వైపు ఆయన కన్నెత్తి చూడలేదు. కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రజలు నానా కష్టాలు పడినప్పుడు వారికి అండగా నిలవకపోగా, తన ఆస్పత్రి ద్వారా పీల్చిపిప్పి చేశారు. నగరాభివృద్ధే ధ్యేయమని ఊదరగొట్టే ఆయన తన విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చిన పాపాన పోలేదు. తాజాగా ఎన్నికలు సమీపిస్తుండటంతో హఠాత్తుగా నగరంపై ప్రేమ ఒలకబోస్తున్న ఆయన తీరుపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రజలెలాపోతే నాకేంటండీ..!
- నాలుగున్నరేళ్లు అదృశ్యమైన నారాయణ
- ఎన్నికల తరుణంలో నెల్లూరుపై హఠాత్తుగా ప్రేమ
- విజయం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు

నెల్లూరు(పొగతోట): ఎన్నికలు రావడంతో నెల్లూరుపై టీడీపీ సిటీ అభ్యర్థి నారాయణకు హఠాత్తుగా ప్రేమ ఏర్పడింది. 2019లో ఓటమి అనంతరం అదృశ్యమైన ఆయన ఇప్పుడు ఉన్నఫళాన ప్రత్యక్షమై ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పిస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి.. తాజాగా అది చేస్తా.. ఇది చేస్తానని ఊదరగొడుతూ.. ప్రచార పర్వాన్ని సాగిస్తున్న ఆయన తీరుపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

అర్ధరాత్రి మంత్రిగా పేరు..

ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకుండా.. 2014లో టీడీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్సీ పదవిని పొందిన నారాయణ పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా కొనసాగారు. ఆ సమయంలో అర్ధరాత్రి మంత్రిగా ఆయన పేరు గడించారు. అర్ధరాత్రి నెల్లూరొచ్చి.. తెల్లారేసరికి విజయవాడలో ప్రత్యక్షమయ్యేవారంటే నగరంపై ఆయనకున్న చిత్తశుద్ధి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

ఎవరెలాపోతే.. నాకేంటి..!

నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 2019లో పోటీ చేసిన ఆయన ఓటమిపాలయ్యారు. నాటి నుంచి ఆయన కనిపించిందే అరుదు. 2020లో కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రజలు నానా కష్టాలు పడ్డారు. లాక్‌డౌన్ కారణంగా వ్యాపార సముదాయాలు మూతపడి.. కూరగాయలు.. నిత్యావసరాలకు ప్రజలు అల్లాడారు. ఆ సమయంలో ప్రజలకు అండగా ఉండాల్సిన ఆయన.. ఎవరెలాపోతే నాకేంటి అనే రీతిలో వ్యవహరించారు. వైద్యం కోసం నారాయణ ఆస్పత్రికి వెళ్లిన వారికి పీల్చిపిప్పి చేశారు.

అండగా నిలిచిన అనిల్

కోవిడ్ సమయంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ బాధితులకు అండగా నిలిచారు. అప్పట్లో ప్రభుత్వ యంత్రాంగం, వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు భరోసా కల్పించారు. కోవిడ్ బారిన పడిన వారిని గుర్తించి ఆస్పత్రికి తరలించడం.. హాస్పిటల్‌కు రాలేనివారిని ఇంట్లోనే ఓ ప్రత్యేక గదిలో ఉంచి అవసరమైన మందులు, సేవలను అందించారు.

ధ్యాసంతా వ్యాపారంపైనే

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తన మందీ మార్బలాన్ని ఇంటింటికీ తిప్పుతూ ఓటర్ల సమాచారాన్ని నాలుగు నెలలుగా నారాయణ సేకరించారు. తనకు ఓటేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. కళాశాలలో ఎన్ని అడ్మిషన్లు వచ్చాయి.. ఫీజులెంత వసూలయ్యాయి.. ఇలా వ్యాపారంపైనే దృష్టి సారించే ఆయన ఈ ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటారాననేది సందేహమే. తమ సమస్యలను విన్నవించాలంటే ఆయన్ను వెతికేందుకే సమయం సరిపోతుందని నగరవాసులు పేర్కొంటున్నారు.

ముస్లింల ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయం



అశేష ప్రజానీకం నడుమ ఎన్నికల ప్రచారంలో విజయసాయిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో ముస్లింల ప్రయోజనాల పరిరక్షణ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని 42వ డివిజన్ మన్సూర్‌నగర్ ఆర్చి వద్ద ప్రజలను ఉద్దేశించి బుధవారం ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రానంతరం నెల్లూరులో ఓ సాధారణ ముస్లింకు టికెట్ ఇచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందని కొనియాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కోట్లను కుమ్మరించి ఓటర్లను ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్నాయని ఆరోపించారు. పెత్తందార్లు కావాలో.. లేక ప్రజల పక్షాన ఉండే తమ పార్టీ కావాలో ఆలోచించాలని కోరారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లను దివంగత సీఎం వైఎస్సార్ కల్పించారని చెప్పారు. నెల్లూరు నగర ఎమ్మెల్యేగా ఖలీల్ అహ్మద్‌ను గెలిపించాలని కోరారు.

యూసీసీపై వైఖరిని తెలియజేయాలి

యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)పై టీడీపీ, జనసేన తమ వైఖరిని తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై టీడీపీ అభ్యర్థి నారాయణను నిలదీయాలని సూచించారు. అన్ని మతాల ఏకాభిప్రాయం కుదిరితేనే ఈ బిల్లుకు తమ పార్టీ మద్దతిస్తుందని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల ద్వారా ఈ డివిజన్లో రూ.50 కోట్లను ప్రభుత్వం అందించిందని వెల్లడించారు. అనంతరం ఖలీల్ అహ్మద్ మాట్లాడారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

వ్యాపారాల్లో మునిగితేలుతున్నారు

ప్రతిపక్ష అభ్యర్థులు వ్యాపారాల్లో మునిగితేలుతున్నారని ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. ప్రజల బాగోగులను పట్టించుకునే స్థితిలో వీరు లేరని చెప్పారు. ఢిల్లీకి.. రాష్ట్రానికి అనుసంధానకర్తగా ఉండే విజయసాయిరెడ్డిని ఎంపీగా గెలిపించుకుందామని పార్టీ నేత ఆనం జయకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్పొరేటర్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- ఎన్నికల అధికారి హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): జిల్లాలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి వారి ఖాతాలో ఖర్చులను జమచేయనున్నామని చెప్పారు. అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉంటే పత్రికలు, టీవీ చానళ్లలో మూడుసార్లు సొంత ఖర్చులతో ప్రకటనలను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. స్టార్ క్యాంపెయినర్లతో ప్రచారాన్ని నిర్వహిస్తే, ఆ ఖర్చులనూ అభ్యర్థుల ఖాతాల్లో జమ చేస్తామని స్పష్టం చేశారు. ఈవీఎంల మాక్ పోలింగ్‌కు రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈ నెల 29తో ముగియనుందని, అదే రోజు మధ్యాహ్నం 3.15కు అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించనున్నామని తెలిపారు. ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, కమిషనర్ వికాస్ మర్మత్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు నుంచి ఓటర్ స్లిప్పుల పంపిణీ

ఓటర్ స్లిప్పులను మే రెండు నుంచి ఎనిమిది వరకు పంపిణీ చేయాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆర్వోలు, నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు పటిష్టంగా జరుగుతున్నాయాననే అంశాన్ని కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సంఘ నిబంధనల మేరకు 85 ఏళ్లు నిండిన వృద్ధులు.. 40 శాతానికిపైగా వైకల్యం కలిగిన వారి కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ఆటో ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు బాపిరెడ్డి, పద్మావతి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరినారాయణన్

నామినేషన్ల హోరు..

- లోక్‌సభకు ఏడు.. అసెంబ్లీకి 48
- భారీగా దాఖలు చేసిన ఇండిపెండెంట్లు

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగియనున్న తరుణంలో బుధవారం భారీగా దాఖలయ్యాయి. పలు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. అసెంబ్లీకి సంబంధించి 41 మంది 48 సెట్లు.. నెల్లూరు లోక్‌సభకు గానూ ఆరుగురు అభ్యర్థులు ఏడు సెట్ల నామినేషన్లను ఆయా ఆర్వోలకు అందజేశారు.

- నెల్లూరు లోక్‌సభ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఇద్దరు, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా ప్రసన్నగణపతి రెండు సెట్లు, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, బీఎస్పీ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలయ్యాయి.
- కందుకూరు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బుర్రా మధుసూధన్ యాదవ్, బుర్రా లక్ష్మి, టీడీపీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు తమ నామినేషన్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు. ఇండిపెండెంట్లుగా ముగ్గురు, బీఎస్పీ తరఫున ఒకరు నామినేషన్లు వేశారు.
- కావలి నియోజకవర్గంలో ఇండిపెండెంట్లుగా ముగ్గురు, జైభారత్ పార్టీ, కాంగ్రెస్, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ తరఫున నామినేషన్లు దాఖలయ్యాయి.
- ఆత్మకూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి పృథ్వీకుమార్‌రెడ్డి తమ నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. ఇండిపెండెంట్లుగా ఇద్దరు, ఐయూఎమ్మెల్ నుంచి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి.
- కోవూరు నియోజకవర్గంలో రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున ఇద్దరు, కాంగ్రెస్, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ, బీసీవైపీ తరఫున ఒక్కో నామినేషన్ దాఖలైంది.
- నెల్లూరు సిటీ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ తరఫున ఒకటి, ఆయన భార్య నసీమా ఒక సెట్ చొప్పున దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థిగా నారాయణ ఒక సెట్, రమాదేవి ఒక సెట్, సింధూర రెండు సెట్ల నామినేషన్లను సమర్పించారు. బీఎస్పీ నుంచి రెండు సెట్లు, ఇండిపెండెంట్లుగా ఇద్దరు నామినేషన్లను అందజేశారు.
- నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒక సెట్, ఇండిపెండెంట్లుగా ఇద్దరు నామినేషన్లు వేశారు.
- సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రెండు సెట్లు, సోమిరెడ్డి శ్రుతి ఒక సెట్, ఇండిపెండెంట్‌గా ఒకరు నామినేషన్ వేశారు.
- ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి రెండు సెట్లు, మేకపాటి అభినవ్‌రెడ్డి ఒక సెట్, టీడీపీ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున ఒక్కో సెట్ నామినేషన్ దాఖలైంది.



వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ తరఫున నామినేషన్ వేస్తున్న కార్పొరేటర్ కామాక్షిదేవి

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 133
లేయర్ (లైవ్) : 93
బ్రాయిలర్ చికెన్ : 236
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 264
లేయర్ చికెన్ : 158

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.78
సన్నవి : రూ.60
పండ్లు : రూ.40



పార్టీలో చేరిన వారితో విజయసాయిరెడ్డి, పర్వతరెడ్డి



ఆదాల సమక్షంలో పార్టీలో చేరిన గిరిజన కుటుంబాలు



వైఎస్సార్‌సీపీ కండువా కప్పుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

జగన్ వెంట నడుస్తాం

వైఎస్సార్‌సీపీలో ఇతర పార్టీ నాయకుల చేరికలు వెల్లువలా జరుగుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడుస్తామని అనేకమంది ముందుకొస్తున్నారు. టీడీపీ యువత విభాగానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి, మహిళా శక్తి నాయకురాలు ఝాన్సీ, టీఎస్ఎస్ఎఫ్ నాయకుడు సుహాంత్‌రెడ్డి బుధవారం నెల్లూరులో పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 25వ డివిజన్ బుజబుజనెల్లూరు నుంచి 70 గిరిజన కుటుంబాలు వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరాయి. నగరంలోని మినీబైపాస్ రోడ్డులోని ఆయన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. బద్దెపూడి రవీంద్ర, అమీర్‌జాన్, ఏపిలగుంట మురళి, జహీద్, రాము, కొండూరు కృష్ణంరాజు పాల్గొన్నారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ చక్రపాణి, మాజీ కౌన్సిలర్ రజనీ ఆధ్వర్యంలో కావలి ఒకటో వార్డు పరిధిలోని మద్దూరుపాడుకు చెందిన వారు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

– నెల్లూరు(దర్గామిట్ట)/నెల్లూరు సిటీ/కావలి

క్రికెట్ బెట్టింగ్ కేసులో సీఐడీ అదుపులో టీడీపీ నేత

నెల్లూరు(క్రైమ్): క్రికెట్ బెట్టింగ్ కేసుకు సంబంధించి నెల్లూరు నగరానికి చెందిన ఓ తెలుగుదేశం నేతను సీఐడీ అధికారులు బుధవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారి కథనం మేరకు.. నగరంలోని రామలింగాపురానికి చెందిన లీలామోహన్‌రెడ్డి టీడీపీలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నాడు. కొన్ని సంవత్సరాల క్రితం జిల్లాలో సంచలనం రేకెత్తించిన క్రికెట్ బెట్టింగ్ కేసులో మోహన్‌రెడ్డి నిందితుడు. దీనిపై విచారణ జరుగుతోంది. మళ్లీ కూడా బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో సీఐడీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నెల్లూరు అధికారులు అతని కార్యకలాపాలపై రెండు రోజులుగా నిఘా ఉంచారు. బుధవారం నగరంలోని ఓ ప్రముఖ హోటల్ వద్ద అదుపులోకి తీసుకుని సీఐడీ కార్యాలయానికి తరలించి విభిన్న కోణాల్లో విచారణ చేపట్టారు. ఫోన్ కాల్స్ డేటాను పరిశీలిస్తున్నారు. దీంతో జనసేన, టీడీపీ నేతలు సీఐడీ కార్యాలయం వద్దకు చేరుకుని కొంతసేపు డ్రామా చేశారు. అధికారులు సర్ది చెప్పడంతో కొద్దిసేపటికి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పాతకక్షల నేపథ్యంలోనే హత్య

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు బీవీ నగర్‌కు చెందిన దశరథ అనే యువకుడి హత్య కేసులో వేదాయపాళెం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నెల్లూరులోని ఆటోనగర్ పడమరవైపు ఖాళీ స్థలాల్లో అతని మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ బుధవారం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. పాతకక్షల నేపథ్యంలోనే దశరథను హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. మృతుడికి వేదాయపాళెం జనశక్తినగర్‌కు చెందిన ఓ వ్యక్తికి పాతకక్షలున్నట్లు గుర్తించారు. సదరు వ్యక్తి మరికొందరితో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఘటనా స్థలంతోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు.



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

గెలిపించాలని కోరుతూ..

ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. వీరికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలకు జై కొడుతున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం తోటపల్లిగూడూరు మండలంలో ప్రచారం చేశారు. కోవూరు మండలంలోని లేగుంటపాడు గ్రామంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని ఆయన కుమార్తె నేహారెడ్డి నగరంలోని 45వ వార్డులో ప్రచారం చేశారు. చిరు వ్యాపారులను పలకరించి కరపత్రాలు అందజేశారు. నెల్లూరు రూరల్ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె హిమబిందు రెండో డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు.

ప్రచార పర్వం

– నెల్లూరు ఫొటోగ్రాఫర్/కోవూరు/తోటపల్లిగూడూరు



వృద్ధురాలిని పలకరిస్తున్న నేహారెడ్డి



మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న హిమబిందు

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత



రామ్మూర్తి నగర్ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను ఆరా తీస్తున్న ఎస్పీ

- ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

నెల్లూరు(క్రైమ్): గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ ఆదేశించారు. ఆయన నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డితో కలిసి నెల్లూరులోని డీకెడబ్ల్యూ కళాశాల, కోటమిట్ట మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్, రంగనాయకులపేట పీఎంఆర్ స్కూల్, వెంకటేశ్వరపురం, రామ్మూర్తి నగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్స్‌లో పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, మౌలిక సదుపాయాల కల్పన తదితరాలపై పోలీసు అధికారులతో చర్చించి సూచనలు, సలహాలిచ్చారు. పోలింగ్ రోజున కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ఓటర్లు మినహా ఇతరులెవరూ ఉండకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ముందస్తు భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఆయన వెంట ఎస్బీ, చిన్నబజారు, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్లు కె.రామకృష్ణారెడ్డి, బి.అశోక్‌కుమార్, అల్తాఫ్ హుస్సేన్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



తౌహిద్ మృతదేహం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్మకూరు 3వ వార్డు కౌన్సిలర్ షేక్ గౌస్‌బాషా కుమారుడు షేక్ తౌహిద్ (29) మృతిచెందాడు. మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. తౌహిద్, తన స్నేహితుడు అశోక్ కలిసి నంద్యాలలో గృహ ప్రవేశానికి మోటార్‌బైక్‌లో వెళ్లారు. మంగళవారం రాత్రి తిరిగి ఇంటికొస్తుండగా డీసీపల్లి వద్ద గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తౌహిద్, అశోక్ తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తౌహిద్ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

డిగ్రీ పరీక్షల్లో విద్యార్థి డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం ఉదయం నిర్వహించిన ఐదో, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 9,225 మంది విద్యార్థులకు గానూ 8,435 మంది హాజరై 790 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 6,341 మందికి గానూ 5,976 మంది హాజరై 365 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరు నగరంలోని చంద్రారెడ్డి డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- రూ.11.59 లక్షల నగదు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో పోలీసు, సెబ్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేసి మద్యం, నగదు అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. అందులో భాగంగా బుధవారం నెల్లూరు బాలాజీ నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో రూ.2 లక్షలు, సంతపేట పరిధిలో రూ.92 వేలు, కోవూరు పరిధిలో రూ.2 లక్షలు, కావలి ఒకటో పట్టణ పరిధిలో రూ.5 లక్షలు, సంగం పరిధిలో రూ.1.67 లక్షలు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. దగదర్తి పరిధిలో 42, సైదాపురంలో 10, బిట్రగుంటలో 35, కృష్ణపట్నం పోర్టులో 21, జలదంకిలో 8, కలిగిరిలో 11, బాలాజీనగర్‌లో 15, సెబ్ అధికారులు 182 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. 1,900 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు.

గడ్డివాముల దగ్ధం

చేజర్ల: మండలంలోని వావిలేరు గ్రామంలో వరిగడ్డి వాములు దగ్ధమైన ఘటన బుధవారం రాత్రి జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే వచ్చి మంటలు ఆర్పివేశారు. దీంతో సమీపంలోని పొగాకు బ్యారెన్‌కు మంటలు వ్యాపించలేదు. సుమారు రూ.30 వేలు నష్టం బాధిత రైతులు వాపోయారు.